సాక్షి ప్రకాశం

శుక్రవారం । 6 । సెప్టెంబర్ । 2024

మట్టి వినాయకా.. జయహో..



ఒంగోలులోని ఎయిమ్స్ క్లబ్, శ్రీగిరి గిరి ప్రదక్షిణ కమిటీ ఆధ్వర్యంలో మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేయనున్నారు. శుక్రవారం ఉదయం తొమ్మిది గంటలకు స్థానిక గాంధీరోడ్డులోని వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి దేవస్థానం వద్ద ప్రజలకు అందజేస్తామని శ్రీగిరి గిరి ప్రదక్షిణ కమిటీ, హిందూ ధార్మిక సంస్థ అధ్యక్షుడు రాధా రమణ గుప్తా జంధ్యం తెలిపారు.

– ఒంగోలు మెట్రో

గరిష్ఠం/కనిష్ఠం
33.9/25

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

స్విమ్మింగ్‌లో గోగినేనివారి పాలెం వాసికి 3 స్వర్ణాలు



శ్రీనివాసరావును సత్కరిస్తున్న నిర్వాహకులు

పొదిలి రూరల్: అంతర్జాతీయ స్విమ్మింగ్ పోటీల్లో పొదిలి మండలం ఉప్పలపాడు పంచాయతీ గోగినేనివారిపాలెం గ్రామానికి చెందిన గోపనబోయిన శ్రీనివాసరావు సత్తా చాటాడు. నేపాల్‌లో ఆగస్టు 31 నుంచి ఈ నెల 4వ తేదీ వరకు ఎస్‌బీకేఎఫ్ ఇంటర్నేషనల్ గేమ్స్‌లో భాగంగా నిర్వహించిన స్విమ్మింగ్ పోటీల్లో మూడు బంగారు పతకాలు కైవసం చేసుకున్నాడు. మొత్తం 9 దేశాల క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీల్లో నాలుగు విభాగాల్లో శ్రీనివాసరావుకు మూడు మెడల్స్ దక్కాయి. 100 మీటర్ల ఫ్రీస్టైల్, 100 మీటర్ల బెస్ట్ స్ట్రోక్, 50 మీటర్ల బటర్ ఫ్లయ్ విభాగాల్లో స్వర్ణ పతకాలు వరించాయి.

ప్రభుత్వ కార్యాలయాలకు స్మార్ట్ మీటర్లు

చీమకుర్తి: మొబైల్ రీచార్జ్ మాదిరిగానే కరెంటు మీటర్లలో కూడా రీచార్జ్ మీటర్లు వచ్చేశాయి. గురువారం సంతనూతలపాడులోని 16 ప్రభుత్వ కార్యాలయాలకు స్థానిక విద్యుత్ ఏఈ సంతోష్ ఆధ్వర్యంలో స్మార్ట్ రీచార్జ్ మీటర్లు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో మొత్తం 90 రీచార్జ్ మీటర్లు బిగించాల్సి ఉండగా, మొదటి విడతగా 16 మీటర్లు బిగించినట్లు ఏఈ తెలిపారు. తొలుత ప్రభుత్వ కార్యాలయాలు, తదుపరి పరిశ్రమలు, చివరిగా గృహాలకు స్మార్ట్ రీచార్జ్ మీటర్లు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. స్మార్ట్ మీటర్లకు త్వరలో చిప్‌లు అమరుస్తామన్నారు. తద్వారా ముందుగానే రీచార్జ్ చేసుకున్న తర్వాత ఎంత డబ్బుకు రీచార్జ్ చేశారో అంతవరకు మాత్రమే కరెంటు సరఫరా అవుతుంది. రీచార్జ్ బ్యాలెన్స్ అయిపోగానే కరెంటు సరఫరా నిలిచిపోతుంది. మళ్లీ సెల్‌ఫోన్‌కు రీచార్జ్ చేసుకున్నట్లు స్మార్ట్ రీచార్జ్ మీటర్‌కు రీచార్జ్ చేసుకోవాల్సి ఉంటుందని ట్రాన్స్‌కో సిబ్బంది వివరించారు.

మఠం భూములన్నీ కొనుగోలు చేసినవే..



మాట్లాడుతున్న బాలమురళీకృష్ణ

మార్కాపురం: పత్రికల్లో అసత్య కథనాలు రాసి తన ప్రతిష్టను దిగజార్చొద్దని మార్కాపురం మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ విజ్ఞప్తి చేశారు. తనపై ఓ పత్రికలో గురువారం వచ్చిన కథనంపై స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని తన చాంబర్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ 1958వ సంవత్సరంలో శ్రీయోగానంద నరసింహస్వామి యోగి వారి భక్తులు, మొదలైన వారి వలన ఆర్జించిన ఆదాయంతో నరసింహాపురం ఇలాఖాలో మఠాన్ని నిర్మించి భూములు కొనుగోలు చేశారని వివరించారు. 1990లో దేవాలయానికి సంబంధించిన 39.80 ఎకరాల స్థలాన్ని, గుడి పరిసర ప్రాంతాలను సుమారు 200 కుటుంబాలకు 99 సంవత్సరాలకు దేవస్థాన కమిటీ లీజుకు ఇచ్చిందని తెలిపారు. అందుకుగానూ 8 ఎకరాల స్థలాన్ని ఒక్కొక్క కుటుంబం వద్ద నుంచి 750 రూపాయలు, 300 రూపాయల చొప్పున విస్తీర్ణంను బట్టి కమిటీ సభ్యులకు చెల్లించి వారికి కేటాయించడం జరిగిందన్నారు. అప్పటి నుంచి వారు అక్కడే జీవనం సాగిస్తున్నారన్నారు. స్వామివారి పూజా కైంకర్యాల కోసం అర్చకులకు 1 ఎకరా, భజంత్రీలకు 6 ఎకరాలు, రజకులకు 2 ఎకరాలు, చిన్న జీయర్ స్వామి ఆశ్రమానికి 3 ఎకరాలు, పట్టణానికి చెందిన తానుగుండ్ల ప్రసాద్‌కు 4 ఎకరాలు కేటాయించడం జరిగిందని వివరించారు. మిగతా స్థలం స్వామివారిపేరున ఇప్పటికీ ఉందని తెలిపారు. అయితే, దేవదాయ ధర్మాదాయ శాఖ 2017లో ఈ దేవాలయాన్ని ఎండోమెంటు ఆధీనంలోకి తీసుకోవడం జరిగిందని చెబుతున్నారని, ఇన్ని సంవత్సరాలుగా గుడిని పట్టించుకోకుండా మార్కాపురం దేవదాయశాఖ అధికారులు ప్రైవేటు వ్యక్తులతో వచ్చి ఈ భూమి దేవదాయశాఖకు చెందినదంటూ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం ఏమిటని ప్రశ్నించారు. 2016లో కమిటీగా ఏర్పడి దేవస్థానాన్ని అభివృద్ధి చేశామని, ప్రతి సంవత్సరం స్వామివారి ఆరాధన, కార్తీక వనభోజనాలు, తదితర కార్యక్రమాలను భక్తుల సహకారాలతో నిర్వహిస్తున్నామని ఆయన చెప్పారు. దీనికి సంబంధించి అధికారులపై తాము దౌర్జన్యాలకు పాల్పడుతున్నామంటూ పలు పత్రికల్లో రాయడం దురదృష్టకరమని అన్నారు. ఇందుకు సంబంధించిన వీలునామా పత్రాలను విలేకరులకు బాలమురళీకృష్ణ అందజేశారు. విలేకరుల సమావేశంలో బొగ్గరపు శేషగిరిరావు, దోగిపర్తి బాబు, దోగిపర్తి హరిప్రసాద్, బొగ్గరపు సుబ్రహ్మణ్యం, చాటకొండ నాగరాజు పాల్గొన్నారు.

మంచి చేస్తే.. ఇంత అక్కసా..?

ట్రాన్స్‌కోలో టీడీపీ నేతలు చెప్పిందే శాసనం..వారు ఏది చెబితే అది చేయడమే పనిగా పెట్టుకున్నారు ఆ శాఖ అధికారులు. ప్రధానంగా జిల్లా కేంద్రం ఒంగోలులోని ట్రాన్స్‌కోలో సివిల్ విభాగానికి చెందిన అధికారుల వ్యవహారశైలి మరీ విడ్డూరంగా మారింది. నిబంధనలన్నీ గాలికొదిలేసి టీడీపీ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నూతన భవన నిర్మాణం పేరుతో అధికారులు వ్యవహరిస్తున్న తీరు వివాదాస్పదంగా మారింది. అండర్ గ్రౌండ్ కేబుళ్ల నిర్మాణానికి సంబంధించిన శిలాఫలకాలను ధ్వంసం చేసి చెత్తకుప్పలో పడేయడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. ఇందులో టీడీపీ నేతలతో పాటు రిటైర్డ్ అధికారి పాత్ర ఉండటం గమనార్హం.



అండర్ గ్రౌండ్ కేబుల్‌ను ప్రారంభిస్తున్న బాలినేని శ్రీనివాసరెడ్డి (ఫైల్)



పగులగొట్టి దూరంగా పడేసిన బాలినేని వేసిన శిలాఫలకాలు

- భవన నిర్మాణాల పేరుతో అండర్ గ్రౌండ్ కేబుళ్ల శిలాఫలకాల ధ్వంసం
- గార్డెన్‌లో ఉండాల్సిన శిలాఫలకాలు చెత్తకుప్పలోకి..
- వీటి ధ్వంసం ఘటనలో రిటైర్డ్ ఈఈదే కీలకపాత్ర
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు
- ట్రాన్స్‌కోలో అధికార పార్టీ నేతలు హల్‌చల్
- హైటెన్షన్ విద్యుత్ లైన్ కింద నిర్మాణాలు, అంతస్తులు ఉండకూడదంటూ ప్రజలకు నోటీసులు
- అదే లైన్ కింద ట్రాన్స్‌కో అధికారుల భవనాల నిర్మాణం

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: ఒంగోలు నగరంలోని హైటెన్షన్ విద్యుత్ లైన్లతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ షాక్‌ల వల్ల పదుల సంఖ్యలో మృత్యువాతపడిన దుర్ఘటనలు సైతం ఉన్నాయి. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని బాలినేని శ్రీనివాసరెడ్డి మంత్రిగా ఉన్నప్పుడు రెండు అండర్ గ్రౌండ్ కేబుళ్ల నిర్మాణానికి నిధులు తెచ్చారు. ఒంగోలు నగర ప్రజల దశాబ్దాల కల నెరవేర్చే దిశగా అడుగులు వేశారు. కర్నూలు రోడ్డు పవర్ ఆఫీసు నుంచి అంజయ్యరోడ్డు, వీఐపీ రోడ్డు మీదుగా మంగమూరు రోడ్డు జంక్షన్‌కు దక్షిణంగా ఉన్న 220 కేవీ సబ్‌స్టేషన్ వరకు నిర్మించిన అండర్ గ్రౌండ్ కేబుల్‌కు అప్పట్లో బాలినేని శ్రీనివాసరెడ్డి రూ.56.74 కోట్లు, పవర్ ఆఫీసు నుంచి వెంకటేశ్వరకాలనీ వరకు నిర్మించతలపెట్టిన అండర్ గ్రౌండ్ కేబుల్‌కు రూ.23.79 కోట్లు మంజూరు చేయించారు. కర్నూలు రోడ్డు నుంచి సబ్‌స్టేషన్ వరకూ సంబంధించిన పనులను 2020 ఫిబ్రవరి 23న ప్రారంభించారు. అనంతరం 123 కేవీ సింగిల్ సర్క్యూట్ రెండో హై టెన్షన్ విద్యుత్ లైను పవర్ ఆఫీసు నుంచి వెంకటేశ్వరకాలనీ మీదుగా వెళుతోంది. దాని స్థానంలో పవర్ ఆఫీసు నుంచి వెంకటేశ్వరకాలనీ వరకు అండర్ గ్రౌండ్ కేబుల్ నిర్మాణం చేపట్టడానికి రూ.23.79 కోట్లు మంజూరు చేశారు. ముందుగా ప్రారంభించిన పనులు పూర్తి కావడంతో ఆ పనులకు సంబంధించి ఒక శిలాఫలకం, రెండో అండర్ గ్రౌండ్ కేబుల్ పనులను ప్రారంభించేందుకు రెండో శిలాఫలకాన్ని 2022 ఏప్రిల్ 6న వేశారు. దశాబ్దాల కాలంగా ప్రజలు పడుతున్న ఇబ్బందులు తొలగించేలా చేసిన మంచి పనుల కోసం ఏర్పాటుచేసిన వీటిని ధ్వంసం చేసిన తీరుపై ప్రజలు దుమ్మెత్తిపోస్తున్నారు. అంతేకాదు.. ప్రస్తుతం నిర్మిస్తున్న గార్డెన్‌లో ఉన్న వీటిని ధ్వంసం చేసి పెకిలించారు. పైభాగం మొత్తం పగులగొట్టి చెత్తలో పడేశారంటే.. ట్రాన్స్‌కో అధికారులను ఏమనాలోనన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. టీడీపీకి చెందిన కాంట్రాక్టర్ ఒత్తిడి మేరకే ఈ శిలాఫలకాలను ధ్వంసం చేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై ట్రాన్స్‌కో అధికారులు, టీడీపీ నాయకులు, కాంట్రాక్టర్‌పై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ నేతలకు అధికారులు జీ హుజూర్ అంటూ ప్రజలకు మంచి జరుగుతున్న వాటిపై కూడా ఇలా అక్కసు వెలిబుచ్చడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. శిలాఫలకాలు అక్కడ ఉంటే వీరికి వచ్చిన నష్టమేమిటో అధికారులు సమాధానం చెప్పాలంటున్నారు. ఈ వ్యవహారం మొత్తం ఆగస్టు 31న పదవీ విరమణ చేసిన సివిల్ విభాగానికి చెందిన ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కనుసన్నల్లోనే నడిచిందని ట్రాన్స్‌కో కార్యాలయంలో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇప్పటికీ సదరు అధికారి చక్రం తిప్పుతుండటం గమనార్హం

ట్రాన్స్‌కోకు ప్రత్యేక చట్టం ఏమైనా ఉందా...

మాకో న్యాయం.. ప్రజలకు మరో న్యాయం అనే చందంగా ఉంది జిల్లాలో ట్రాన్స్‌కో అధికారుల తీరు. ఒంగోలు నగరంలోని పవర్ ఆఫీసు నుంచి కర్నూల్ రోడ్డును క్రాస్ చేసుకుంటూ రావి ఆంజనేయనగర్, ఎన్‌జీఓ కాలనీ, పాత బైపాస్ రోడ్డు, ఉడ్ నగర్, వెంకటేశ్వరకాలనీ మీదుగా ఇంకొల్లు వెళ్లే 132 కేవీ సింగిల్ సర్క్యూట్ హైటెన్షన్ లైను ఉంది. ఈ విద్యుత్ లైన్ కింద ఇళ్లు, వ్యాపార సముదాయాలు, పరిశ్రమలు అనేకం ఉన్నాయి. ఈ హైటెన్షన్ విద్యుత్ లైన్ కింద నూతనంగా ఇళ్ల నిర్మాణం చేపట్టడంగానీ, చెట్లు పెంచడంగానీ, ఇతర ప్రసార మాధ్యమాలకు సంబంధించిన కేబుళ్ల ఏర్పాటు, తదితర కార్యకలాపాలు చేపట్టరాదని ప్రజలకు అధికారులు నోటీసులిచ్చారు. హై టెన్షన్ విద్యుత్ లైన్ల కింద హారిజాంటల్‌గా 2.9 నుంచి 3.8 మీటర్లలోపు ఎత్తులో, వర్టికల్గా 4.6 నుంచి 5.5 మీటర్ల ఎత్తులో మాత్రమే ఎలాంటి కార్యకలాపాలైనా చేసుకోవచ్చని ఆ నోటీసుల్లో స్పష్టం చేశారు. నిబంధనలు అతిక్రమించి కార్యక్రమాలు చేస్తే ఎలాంటి నష్టం సంభవించినా ఇండియన్ ఎలక్ట్రికల్ రూల్స్ 1956 సెక్షన్ 80, 82 ప్రకారం చర్యలు తీసుకోబడతాయని కూడా ఆ నోటీసులో హెచ్చరికలు జారీ చేశారు. అయితే, రూ.4 కోట్లతో నిర్మిస్తున్న ట్రాన్స్ కో సూపరింటెండెంట్ ఇంజినీర్ (ఎస్‌ఈ) కార్యాలయ నూతన భవనానికి మాత్రం ఈ నిబంధనలు గాలికొదిలేసి మరీ నిర్మిస్తున్నారు. రెండంతస్తులతో పాటు ఆపైన వాటర్ ట్యాంకు, ఇతర నిర్మాణాలు కూడా చేపడుతున్నారు. ఏకంగా 10 మీటర్లకుపైగా ఎత్తులో నిర్మిస్తున్నారు. మాకో న్యాయం ...ట్రాన్స్‌కో అధికారులకు మరో న్యాయమా అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.



హైటెన్షన్ విద్యుత్ లైన్ కింద నూతనంగా నిర్మిస్తున్న ట్రాన్స్‌కో ఎస్‌ఈకి చెందిన రెండంతస్తుల భవనం

వరి సాగుకు నీరందించాలి

- జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి



కలెక్టర్‌తో మాట్లాడుతున్న బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డి

దర్శి: నాగార్జున సాగర్ డ్యాంలో పూర్తి స్థాయి నీటి మట్టం ఉన్నందున కుడి కాలువ ఆయకట్టు పరిధిలో వరి సాగుకు రైతులకు నీరందించాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి గురువారం కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిసి విజ్ఞప్తి చేశారు. సాగర్ ఆయకట్టు కింద వరి పంట సాగుచేసేందుకు నార్లు పోసుకుని రైతులు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ప్రభుత్వం ఇప్పటి వరకు వరి సాగుకు నీరిస్తామని ప్రకటన చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. ఉన్నతాధికారులతో మాట్లాడి సాగర్ కుడికాలువ కింద వరి పంట సాగుచేసుకునేందుకు నీరిప్పించి రైతులకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డి కోరారు.

వైజాగ్‌లో మెగా ఎగ్జిబిషన్‌లో పాల్గొనండి

ఒంగోలు సెంట్రల్: ఎన్‌హెచ్‌డీఎఫ్‌సీ రుణాలు పొందిన విభిన్న ప్రతిభావంతులు తయారు చేసిన వస్తువుల ప్రదర్శనతో పాటు వ్యాపారంలో మెళకువలు నేర్పించేందుకు ఈ నెల 19 నుంచి 29వ తేదీ వరకు వైజాగ్‌లోని ఏయూ మెరైన్ గ్రౌండ్స్‌లో మెగా ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమశాఖ జిల్లా అధికారి జి.అర్చన తెలిపారు. ఆసక్తి గల వారి వస్తువుల ప్రదర్శనకు ప్రత్యేక స్టాల్స్‌ను కేటాయించి వ్యాపార అభివృద్ధికి, మార్కెటింగ్‌కు మరింత అవకాశం కల్పించనున్నట్లు చెప్పారు.

మెగా ఎగ్జిబిషన్‌లో పాల్గొనదలచిన వారు దివ్యాంగుల సంక్షేమశాఖ కార్యాలయంలో దరఖాస్తులు పొంది పూర్తి చేయాలని, సంబంధిత ధృవీకరణ పత్రాలను జత చేసి ఈ నెల 9వ తేదీలోపు కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. పూర్తి వివరాలకు కార్యాలయ సందర్శన వేళల్లో 08592–281310 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

గురువే ప్రత్యక్ష దైవం



డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ, కలెక్టర్ తమీమ్ అన్సారియా, బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి



సత్కారం అందుకున్న ఉత్తమ ఉపాధ్యాయులు

- ఉపాధ్యాయుల చేతుల్లోనే విద్యార్థుల ఉత్తమ భవిష్యత్తు
- విద్యార్థుల ఎదుగుదలే గురుదక్షిణగా భావించడం గొప్ప విషయం
- జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ
- ఘనంగా టీచర్స్ డే వేడుకలు

ఒంగోలు అర్బన్: తల్లిదండ్రుల తర్వాత గురువుకే స్థానం కల్పించిన గొప్ప సంస్కృతి మనదని, గురువే ప్రత్యక్ష దైవమని జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. గురువారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రకాశం భవనంలోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక భవనంలో గురు పూజోత్సవం–2024 వేడుకలను ఘనంగా నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్‌తో పాటు కలెక్టర్ తమీమ్ అన్సారియా, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, డీఈఓ సుభద్ర, ఒంగోలు మేయర్ సుజాత, తదితరులు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ విద్యార్థుల ఉత్తమ భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతిలోనే ఉంటుందని, వారి ద్వారానే ఉత్తమ సమాజం తయారవుతుందని అన్నారు. విద్యార్థుల ఎదుగుదలే గురుదక్షిణగా భావించి ఉపాధ్యాయులు పనిచేస్తారన్నారు. అటువంటి గురువుల సేవలను స్మరించుకోవడం, వారిని సత్కరించడం గర్వకారణమన్నారు. ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చిన ఉత్తమ అధ్యాపకుడు, మేధావి, పండితుడైన భారత తొలి ఉప రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినమైన సెప్టెంబర్ 5వ తేదీని ఆయన గౌరవార్థం ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం జరుగుతుందన్నారు. దివంగత రాష్ట్రపతి అబ్దుల్ కలాం చెప్పినట్లు ప్రపంచంలో ఎన్ని వృత్తులున్నా.. ఆ వృత్తుల్లో పనిచేసే వారందరినీ తయారు చేసే వృత్తి ఉపాధ్యాయ వృత్తి ఒక్కటేనని, అందుకే ఉపాధ్యాయులంటే తనకు ఎంతో గౌరవమని జెడ్పీ చైర్‌పర్సన్ అన్నారు. విద్యపై ఆసక్తితో తాను, తన కుటుంబ సభ్యులు బీవీఎస్‌ఆర్ ట్రస్టు ద్వారా పేద విద్యార్థులకు ఆర్థికంగా చేయూతనిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన టీచర్లకు శుభాకాంక్షలు తెలిపారు. మంచి సమాజాన్ని స్థాపించేందుకు కృషి చేయాలని వారిని కోరారు.

ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకం : కలెక్టర్

కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ ప్రతి ఒక్కరి జీవితంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. విద్య ద్వారా ప్రతిఒక్కరూ ఉన్నత స్థానాలకు ఎదగడంతో పాటు ఉత్తమ సమాజాన్ని స్థాపించవచ్చన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు సంస్కారాన్ని నేర్పించి రేపటి పౌరులుగా తయారు చేసే బాధ్యతను ఉపాధ్యాయులు నిర్వర్తిస్తున్నారన్నారు. విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను అంచనా వేసి దానికి తగిన విధంగా విద్యాబుద్ధులు నేర్పడం ఉపాధ్యాయులకే సాధ్యమన్నారు. విద్యార్థులు సాధించిన విజయాలను వారి విజయాలుగా భావించి సంతోషించేవారు ఉపాధ్యాయులంటూ.. తనకు విద్య నేర్పిన ఉపాధ్యాయులను కలెక్టర్ గుర్తుచేసుకున్నారు. జిల్లాలో 72 శాతం అక్షరాస్యత ఉందని, దాన్ని నూరు శాతం సాధించాల్సిన అవసరం ఉందని ఆమె అన్నారు. బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని స్పష్టం చేశారు. ఆ మేరకు ఆగస్టు నుంచి స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ఇప్పటి వరకు 30 మంది పిల్లలను బడిలో చేర్పడం జరిగిందన్నారు. 18 ఏళ్లలోపు పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని జిల్లాలో బంగారు బాల్యం కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులు వారి కుటుంబంతో కంటే విద్యార్థులతోనే ఎక్కువ సమయం గడుపుతారని అన్నారు. విద్యార్థుల ఎదుగుదలను చూసి సంతోషపడే మహోన్నతమైన వారు ఉపాధ్యాయులని కొనియాడారు. విద్యార్థుల సామర్థ్యాన్ని అంచనా వేసి వారికి తగినట్లుగా విద్యా బోధన చేయడంతో పాటు మంచి లక్షణాలు పెంపొందించే ఉపాధ్యాయులు సమాజంలో ఎంతో గౌరవమైన స్థానంలో ఉంటారని అన్నారు. అనంతరం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 62 మందిని అతిథులంతా ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉప విద్యాశాఖాధికారి సుబ్బారావు, విద్యాశాఖాధికారులు, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో ఇద్దరికి పదవులు

ఒంగోలు: వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల రాష్ట్ర అధ్యక్షులుగా జిల్లాకు చెందిన ఇద్దరికి అవకాశం లభించింది. ఆ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకం జరిగినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటించింది. ఆరెకటిక/కటిక విభాగం రాష్ట్ర అధ్యక్షురాలిగా దాదా కుమారిలక్ష్మి (ఆరెకటిక కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్)ని, చాత్తాడ శ్రీవైష్ణవ విభాగం రాష్ట్ర అధ్యక్షునిగా టి.మనోజ్‌కుమార్ (చాత్తాడ శ్రీవైష్ణవ కార్పొరేషన్ మాజీ చైర్మన్)ను నియమించారు.



దాదా కుమారిలక్ష్మి



టి.మనోజ్‌కుమార్

మారీచులతో దోస్తీ!

- అధికారం, అక్రమార్కులకు తలొంచిన పోలీసు, రెవెన్యూ అధికారులు
- టీడీపీ నాయకుడితో ఆ రెండు శాఖల వ్యక్తులు చెట్టాపట్టాల్
- అక్రమ రవాణాపై ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టిస్తున్న వైనం
- యథేచ్ఛగా ఇసుక తరలిస్తూ మీసం మెలేస్తున్న తెలుగు తమ్ముళ్లు
- టంగుటూరులోని కీర్తి మెడికల్స్ సమీపంలో ఇసుక డంప్



జరుగుమల్లి పోలీస్‌స్టేషన్ మీదుగా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్

ఒంగోలు టాస్క్‌ఫోర్స్: సంపాదనపై మితిమీరిన యావతో అధికార టీడీపీ నేతలు అక్రమ మార్గం ఎంచుకుంటే.. అడ్డుకోవాల్సిన అధికారులు అండగా నిలుస్తున్నారు. ఇసుక అక్రమంగా తరలిపోతోందని జరుగుమల్లి మండల ప్రజలు కోడై కూస్తున్నా ''అబ్బే.. అలాంటిదేమీ లేదు'' అంటూ ఉన్నతాధికారులను సైతం తప్పుదోవ పట్టిస్తున్నారు. తెలుగుతమ్ముళ్లు మాత్రం యథేచ్ఛగా ఇసుక దందా సాగిస్తూ తమను ఆపే దమ్ము ఎవరికి ఉందన్నట్టుగా మీసాలు మెలేస్తుండటం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళ్తే.. జిల్లాలోని స్టాక్ పాయింట్లలో ఇసుక లభ్యత లేకపోవడంతో డిమాండ్‌ను సొమ్ము చేసుకునేందుకు టీడీపీ నేతలు బరి తెగించారు. జరుగుమల్లి, చింతలపాలెం రీచ్‌ల్లో ఇసుకను కొల్లగొట్టేందుకు పక్కాగా పథకం రూపొందించిన ఓ టీడీపీ నాయకుడు.. పోలీస్, రెవెన్యూ శాఖలోని వ్యక్తులను పావులుగా మార్చాడు. టంగుటూరు మండలం కాకుటూరివారిపాలెం పంచాయతీ కార్యదర్శి మూడు రోజులపాటు 20 ట్రాక్టర్ల చొప్పున ఇసుక కావాలని కోరినట్లు వంక చూపారు. రీచ్‌ల్లో తవ్విన ఇసుకను టంగుటూరు మండల కేంద్రంలో డంప్ చేశాడు. రయ్యిమని దూసుకొస్తున్న ట్రాక్టర్లను కట్టడి చేయాల్సిన పోలీసులు, రెవెన్యూ అధికారులు ఏమీ తెలియనట్టు నిద్ర నటించడం గమనార్హం. ఎక్కడా ఇసుక అక్రమ రవాణా చేయడం లేదని అధికారులు బుకాయిస్తూ.. 60 ట్రాక్టర్ల ఇసుక తరలించేందుకు అక్రమార్కులకు సహకరించారని గ్రామస్తులు బాహాటంగానే ఆరోపిస్తున్నారు. ఈ విషయమై వీఆర్‌ఓలతోపాటు ఆర్‌ఐ కూడా జరుగుమల్లి తహసీల్దార్ జనార్దన్, ఉన్నతాధికారులకు తప్పుడు సమాచారం ఇవ్వడం చర్చనీయాంశమైంది.

హవ్వ.. ఇంత బరితెగింపా..

పంచాయతీ కార్యదర్శి కోరినట్లు వంక చూపి ఇసుక అక్రమంగా తరలించడం వెనుక పోలీసు శాఖకు చెందిన వ్యక్తి, పంచాయతీరాజ్ శాఖకు చెందిన మరో వ్యక్తి ప్రధాన పాత్ర పోషించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. టీడీపీ నాయకుడు ముట్టజెబుతున్న మామూళ్లు పుచ్చుకుంటూ ఆ రెండు శాఖల అధికారులే అక్రమ రవాణాకు సహకరిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రెవెన్యూ అధికారులు, పోలీసులకుతోడు సెబ్ అధికారులు కూడా ఇసుక దందా జరగడం లేదని, పత్రికల్లో వచ్చినవి పాత ఫొటోలని ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టిస్తున్నట్లు సమాచారం. సెబ్, విజిలెన్స్ అధికారులు ఇసుక మాఫియా నుంచి నెల మామూళ్లు తీసుకుంటున్నట్లు రీచ్‌ల ఛాయలకే రావడం లేదని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. ఇటీవల విజిలెన్స్ అధికారులు ట్రాక్టర్లను ఆపి ఒకొక్కరి నుంచి రూ.5 వేలు వసూలు చేసిన విషయం సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది. మామూళ్లు ఇచ్చే వారిని వదిలిపెట్టి, ఇవ్వనివారికి జరిమానా విధిస్తున్నారన్న విమర్శలూ లేకపోలేదు.

ఆధారాలున్నా.. పాత ఫొటోలట!



టంగుటూరు ఆర్‌యూబీ వైపు వెళ్తున్న ఇసుక ట్రాక్టర్

ఇసుక అక్రమ రవాణా సాగడం లేదన్నది పోలీసులు, రెవెన్యూ అధికారులు తమ ఉన్నతాధికారులతో వల్లెవేస్తున్న మాట. ఇసుక ట్రాక్టర్లు బుధవారం పోలీస్‌స్టేషన్ మీదుగానే తరలివెళ్లినా పత్రికలో వచ్చినవి పాత ఫొటోలని చెప్పడంలో మతలబు ఏమిటో వారికే తెలియాలి. పోలీస్‌స్టేషన్ వద్ద సీసీ కెమెరాలు, ఆ ఇసుకను అక్రమార్కులు డంప్ చేసిన టంగుటూరులోని కీర్తి మెడికల్ సమీపంలో సీసీ కెమెరాలు తనిఖీ చేసినా వాస్తవమేంటో తెలుస్తుందని జరుగుమల్లి, చింతలపాలెం వాసులు కుండబద్దలు కొడుతున్నారు. ఇదిలా ఉండగా గురువారం కూడా ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్ల ఫొటోలు సోషల్‌మీడియాలో వైరల్ అయ్యాయి. ఓ ట్రాక్టర్ జరుగుమల్లి పోలీసుస్టేషన్ మీదుగా, టంగుటూరు రైల్వే బ్రిడ్జి అండర్ పాస్ గుండా వెళ్తున్న ఫొటోలు తేదీ, సమయం, లొకేషన్‌తో సహా సోషల్ మీడియాలో ఉంచిన గ్రామస్తులు అధికారుల తీరును ఎండగడుతున్నారు.